జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | సోమవారం 31 ఆగస్టు 2026 | సంపుటి : 17 | సంచిక : 52 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, సూర్య చంద్రుల సమయాలు సూర్యోదయం : 5:28 , సూర్యాస్తమయం : 6:32 , చంద్రోదయం : 3:38 చంద్రాస్తమయం : 3:07 పంచాంగం, తిథి : శుద్ధ ద్వాదశి రా. 10:31 వరకు, తర్వాత త్రయోదశి, నక్షత్రం: విశాఖ రా. 8:10 వరకు, తర్వాత అనూరాధ, యోగం : సిద్ధం మ. 1:19 వరకు, తర్వాత సాధ్యం, కరణం: బవ ఉ. 9:47 వరకు, తర్వాత బాలవ రా. 10:31 వరకు, తర్వాత కౌలవ

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail : prajajyothidaily@gmail.com



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

94402 31967


## వికారాబాద్ జిల్లాలో బిజెపి జెండా ఎగరవేయాలి



బిజెపిలో యువతకు సముచిత స్థానం ఉంటుంది

జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన యు రమేష్ కుమార్

రమేష్ కుమార్ కు శు భాకాంక్షలు చెప్పిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

## రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ

### ఈ ఏడాది చివరికల్లా పనులు పూర్తి చేస్తాం

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 30( ప్రజా జ్యోతి):** వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేసి ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఆదివారం వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆయన సందర్శించి కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్‌లో జరుగుతున్న పనుల పురోగతిని రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి.. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను సుమారు రూ.27 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రైలు ప్రమాదాల నివారణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో 'కవచ్' సాంకేతికతను అమలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో బుల్లెట్ ట్రైన్ తెలంగాణకు వస్తే రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచే అవకాశం ఉందన్నారు. బుల్లెట్ ట్రైన్ వంటి ఆధునిక రవాణా వ్యవస్థలతో రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు.

## బీఆర్ఎస్ పార్టీలో ఉన్నానంటూనే కాంగ్రెస్ సభల్లో ఏంటి మీ పని

చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి

ఎవరిని మెప్పించడానికి ఎమ్మెల్యే గాంధీ ఈ ద్వంద్వ వైఖరి

కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిక్షణా సభలో పాల్గొనడంపై విమర్శలు

స్వలాభం కోసం ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత బొబ్బ నవతారెడ్డి




# వంకరటింకర రోడ్డు ఎందుకు?



### హైదరాబాద్--బీజాపూర్ హైవే పనులపై కిషన్‌రెడ్డి ఫైర్

### అధికారులను నిలదీసిన కేంద్ర మంత్రి.. ప్రమాదాల ముప్పుపై ఆగ్రహం



**చేవెళ్ల ఆగస్టు 30(ప్రజా జ్యోతి):** హైదరాబాద్--బీజాపూర్ జాతీయ రహదారి పనుల తీరుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. చేవెళ్ల పరిధిలో జరుగుతున్న హైవే పనులను ఆయన పరిశీలించారు. పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు వంకరటింకరగా ఉండటం, మలుపులు ఎక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి రహదారితో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. భూసేకరణ పరిస్థితిపై కూడా అధికారులను ప్రశ్నించారు. రోడ్డు పనుల విషయంలో మంత్రి అడిగిన ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకపోవడంతో ఆయన సీరియస్ అయ్యారు. హైవే పనులపై హైదరాబాద్‌లో అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు.

**సర్వీస్ రోడ్డు సమస్యపై రైతుల ఫిర్యాదు**

రహదారికి ఇరువైపులా ఎత్తు ఎక్కువగా ఉండటంతో ఒకవైపు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి, మరోవైపు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు



# శివ శివాని డిగ్రీ కళాశాలలో ఘనంగా సమవర్తన--2026

**కొంపల్లిలో రెండవ స్నాతకోత్సవం –**
**– దాదాపు 700 మంది**
**పట్టభద్రులకు డిగ్రీ పట్టాల ప్రదానం**




**కొంపల్లి, ఆగస్టు 30(ప్రజా జ్యోతి )** శివ శివాని డిగ్రీ కళాశాల (అటానమస్), కొంపల్లిలో రెండవ సమవర్తన--2026 కార్యక్రమాన్ని ఆదివారం హైదవ గౌరిక్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలో వివిధ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన దాదాపు 700 మంది పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరై పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యా జ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి వినియోగిస్తూ, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రస్తుత వేగంగా మారుతున్న ప్రపంచంలో విద్యార్థులు తమ విద్యను కేవలం డిగ్రీకి పరిమితం చేయకుండా, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం మరియు సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవడం ఎంతో అవసరమని సూచించారు. శివ శివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అధ్యక్షురాలు శ్రీమతి ఎస్. ఆరతి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వైస్ ప్రెసిడెంట్ ఢ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా. శైలేష్ సంపతి స్వాగత ప్రసంగం చేశారు. అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి దీపికా సంపతి కార్యక్రమంలో పాల్గొని పట్టభద్రులను అభినందించారు.

ఈ సందర్భంగా శివ శివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అధ్యక్షురాలు శ్రీమతి ఎస్. ఆరతి మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన విజయం వారి కృషి, పట్టుదలతో పాటు తల్లిదండ్రులు మరియు అధ్యాపకుల నిరంతర సహకారానికి ప్రతిఫలమని అన్నారు. డిగ్రీ పట్టా పొందడం విద్యార్థుల విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి మాత్రమేనని, వారి జీవితంలో కొత్త అవకాశాలకు ఇది ఆరంభమని పేర్కొన్నారు.వైస్ ప్రెసిడెంట్ ఢ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా. శైలేష్ సంపతి మాట్లాడుతూ విద్యార్థులు తమ వృత్తి జీవితంలో జ్ఞానం, నైపుణ్యాలతో పాటు నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యత మరియు మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె అన్నారు. జీవితంలో ఎదురయ్యే విజయాలు, వైఫల్యాలను సమానంగా స్వీకరించి, ప్రతి అనుభవం నుంచి నేర్చుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

యువత దేశ భవిష్యత్తుకు ప్రధాన శక్తి అని పేర్కొన్న అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ , దీపిక సంపతీ విద్యార్థులు తమ ప్రతిభను సమాజ అభివృద్ధికి మరియు దేశ ప్రగతికి ఉపయోగించాలని పిలుపునిచ్చారు. వారు ఎంచుకున్న రంగంలో నైపుణ్యంతో పాటు మానవీయ విలువలను పాటిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

శివ శివాని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి పి. మమత కళాశాల అకడమిక్ రిపోర్టును సమర్పించారు. కళాశాల విద్యా ప్రమాణాలు, నూతన కోర్సులు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ప్లేస్‌మెంట్లు, పరిశ్రమలతో అనుసంధానం, సహపాఠ్య మరియు అదనపు కార్యక్రమాల్లో కళాశాల సాధించిన పురోగతిని ఆమె వివరించారు.ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేసి వారి విద్యా ప్రతిభను అభినందించారు. ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.20,000, ద్వితీయ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.10,000, తృతీయ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.5,000 చొప్పున నగదు బహుమతులను అందజేశారు. డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందోత్సాహాలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిన సమవర్తన--2026 కార్యక్రమం అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

ఈ సందర్భంగా పట్టాలు అందుకున్న విద్యార్థులను అభినందిస్తూ, వారు తమ తల్లిదండ్రులు మరియు అధ్యాపకుల త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ శివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చెందిన వివిధ సంస్థల అధిపతులు, విభాగాధిపతులు ( హెచ్ ఓ డి ఎస్ ), బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో ఉన్నానంటూనే కాంగ్రెస్ సభల్లో ఏంటి మీ పని

**చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి**
**ఎవరిని మెప్పించడానికి ఎమ్మెల్యే గాంధీ ఈ ద్వంద్వ వైఖరి**
**కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిక్షణా సభలో పాల్గొనడంపై విమర్శలు**
**స్వలాభం కోసం ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత బొబ్బ నవతారెడ్డి మండిపాటు**
**రానున్న రోజుల్లో శేరిలింగంపల్లి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిక**





**శేరిలింగంపల్లి, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి):** తాను బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీలోనే ఉన్నానని పైకి చెబుతూ..ప్రతిపక్ష హోదా పిఎసి చైర్మన్ పదవి అనుభవిస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించే అంతర్గత కార్యక్రమాల్లో శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొనడం దారుణం అని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు,మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.స్వలాభం కోసం ఆయన ఆడుతున్న ఈ అవకాశవాద రాజకీయ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే ఆయనకు తగిన బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎమ్మెల్యే తీరుపై నిప్పులు చెరిగారు.

**ఎవరిని మెప్పించేందుకు ఈ నాటకాలు...**

శనివారం మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఆ పార్టీ శ్రేణుల కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2 కార్యక్రమాన్ని నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వి. జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బీఎల్ఏలు, కార్యకర్తలకు ఓటరు నమోదుపై దిశానిర్దేశం చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ సభలో రాహుల్ గాంధీ,సోనియా గాంధీ,మీనాక్షి నటరాజన్,మహేష్ గౌడ్ ఫోటో లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొనడంపై నవతారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నేను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నాను.. పార్టీ మారలేదని, పిఎసి పదవి అనుభవిస్తూ కూడా పదేపదే బీరాలు పోయే గాంధీ,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వేదికను పంచుకోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ఆమె నిలదీశారు. ఎవరిని మెప్పించడం కోసం ఆయన ఈ డ్రామాలు ఆడుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి ప్రజలను ఇంకా ఎన్ని రోజులు మభ్యపెట్టి,మోసం చేస్తారు ఎమ్మెల్యే గాంధీ తన ద్వంద్వ వైఖరితో శేరిలింగంపల్లి ప్రజలను తీవ్రంగా మభ్యపెడుతు,మోసం చేస్తున్నారు అని నవతారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని గుడ్డిగా సమర్థిస్తూ, ఆ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వ్యక్తి.. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.ఓటు హక్కు మన హక్కు ఓటు రక్షణ మన బాధ్యత అంటూ కాంగ్రెస్ నాయకులు ఆ వేదికపై ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇవ్వడం, అదే వేదికపై.. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీకి కొమ్ముకాస్తున్న ఎమ్మెల్యే కూర్చోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఆమె ఎద్దేవా చేశారు.

**ప్రజలు తగిన బుద్ధి చెబుతారు!**

పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసమే అరెకపూడి గాంధీ ఇలాంటి ఊసరవెల్లి రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆమె విమర్శించారు.ఆయన రాజకీయ అవకాశవాదాన్ని,మోసకారి నైజాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు.అటు బీఆర్ఎస్ పార్టీని,ఇటు తనను నమ్మి ఓటేసిన నియోజకవర్గ ప్రజలను ఏకకాలంలో మోసం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ లో చేరాను అని ఒప్పుకొని శేరిలింగంపల్లి ప్రజలకు క్షమాపణ చెప్పి,పిఎసి పదవికి రాజీనామా చేయండి అని బొబ్బ నవత రెడ్డి డిమాండ్ చేశారు.

# జెన్ జి ఉద్యమంలో మనం కూడా భాగస్వాములు కావాలి.

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.**

కుత్బుల్లాపూర్ ఆగష్టు 30(ప్రజా జ్యోతి ) అఖిల భారత యువజన సమాఖ్య కుత్బుల్లాపూర్ మండల మహాసభ నేడు మఖ్దూం నగర్ సిపిఐ కార్యాలయంలో ఏ ఐ వై ఎఫ్ కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ మహాసభలకు ముఖ్యతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సల్మాన్, సత్యప్రసాద్ లు పాల్గొని మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు,ప్రతి ఒక్కరికి 15 లక్షల రూపాయలు, అవినీతికి వ్యతిరేకంగా లోక్పాల్ బిల్లు వంటి వాగ్దానాలు చేసి ఎన్నికలో గెలిచి ఎలాంటి హామీలను నిలబెట్టకుండా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం లేదా తన అనుచరులైన అదానీ అంబానీకి అమ్మడం చేసి లక్షలాది మంది పొట్టగొట్టిన చరిత్ర కేవలం బీజేపీకే ఉంటుందని అన్నారు.పరీక్షల లీక్ పై ఉద్యమం చేస్తే బీజేపీ ఆర్ ఎస్ ఎస్ బత్తాయిలు వాళ్లను నక్సలైట్లని,కమ్యూనిస్టులని,దేశ ద్రోహులని ప్రచారం చెయ్యడం సిగ్గుమాలిన పనని,చివరికి వాళ్లే ప్రజలకు క్షమాపణ కోరారని అన్నారు.నీట్ ఉద్యమం ఒక గుణపాఠమని కావున ఉద్యమం చేస్తే ఏదైనా సాధ్యమని దానికి నాయకత్వం నేటి యువతనే వహించిందని అలంటి యువతను ఆదర్శ0గా తీసుకోని ఇక్కడి యువత రాజకీయాల్లోకి వచ్చి అవినీతి కబ్జాకోరుల చేతిల నుండి మన సమాజాన్ని రక్షించి మంచి నాయకులుగా,ప్రజాప్రతినిధులుగా ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి స్వామి మాట్లాడుతూ యువత నిర్వహించే అన్ని ఉద్యమాలకు సిపిఐ మద్దతు ఉంటుందని అన్నారు.

సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్ష కార్యదర్శులుగా ప్రవీణ్ కీర్తి కోశాధికారిగా వి సురేష్ లతోపాటు తొమ్మిది మంది ని ఆఫీస్ బేరాలుగా తీసుకోవడం జరిగింది.




# సామాన్యులకు ఈవీలను అందుబాటులోకి తేవడమే లక్ష్యం



**హైదరాబాద్, ఆగస్ట్ 29 (ప్రజా జ్యోతి) :** ఈవీలను సామాన్యులకు మరింత చేరువ చేసే లక్ష్యంతో ఏథర్ ఎనర్జీ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ 'కోనార్క్'ను 'ఏథర్ కమ్యూనిటీ–డే 2026' నాలుగో ఎడిషన్‌లో పరిచయం చేసినట్లుఏథర్ ఎనర్జీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ తరుణ్ మెహతా ఆదివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహ వ్యవస్థాపకుడు, సీటీఓ స్వప్నిల్ జైన్ తోకలసి ఆయన మాట్లాడుతూ రోజువారీ రైడింగ్‌ను సులభతరం చేసేలా కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేశామని తెలిపారు. ఎస్, జెడ్ శ్రేణుల్లో ఆరు వేరియంట్లలో లభించే కోనార్క్ గరిష్ఠంగా 200 కి.మీ. ఐడీసీ రేంజ్ అందిస్తుందని తెలిపారు. కోనార్క్‌లో ఎఈబిఎస్, మ్యాజిక్‌కీ, ఆటోపాప్, ఎయిర్‌వాక్ వంటి అధునాతన ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. సర్వీసింగ్ విరామాన్ని 10 వేల కి.మీకు పెంచగా, ఐదో తరం బెడ్‌రాక్ బ్యాటరీపై 10 ఏళ్లు/1 లక్ష కి.మీ. వారంటీ అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్ 125, ఎస్ 161 వేరియంట్ల బుకింగ్‌లు, డెలివరీలు సెప్టెంబర్ మధ్య నుంచి దశలవారీగా ప్రారంభం కానున్నాయని తెలిపారు.

# సైబరాబాద్ లో వీకెండ్--స్పెషల్ డ్రంక్ డ్రైవ్..182 మందిపై కేసులు

**సైబరాబాద్ ట్రాఫిక్ ఎడిసిపి అడ్మిన్ జి నరేందర్**



**శేరిలింగంపల్లి, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ఏడిసిపి అడ్మిన్, జి నరేందర్ఈ డ్రైవ్‌లో భాగంగా 182 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.154 ద్విచక్ర వాహనదారులు,07 ఆటోలు,20 కార్లు, 01 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే --- 149 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -25 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -08 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు.మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (24.08.2026 --29.08.2026) లో 308 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.00 మందికి జరిమానా,జైలు శిక్ష, 07 మందికి జరిమానా,సోషల్ సర్వీస్,301 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# నూతన వధూవరులకు కొలను హనుమంత్ రెడ్డి ఆశీస్సులు



**కొంపల్లి, ఆగస్టు 30 (ప్రజా జ్యోతి )** కొంపల్లి డివిజన్ పరిధిలోని చందర్ రెడ్డి గార్డెన్‌లో రిటైర్డ్ ఎస్సై చంద్రశేఖర్ తనయుడు సాయి రాహుల్--సంజన వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అన్నారం గోపాల్ రెడ్డి, జైబెరి గోపాల్, ఉపేందర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# దుండిగల్‌లో ఘనంగా రాజరాజేశ్వర పోచమ్మ తల్లి బోనాల పండుగ



**దుండిగల్, ఆగస్టు 30(ప్రజా జ్యోతి )** దుండిగల్‌లో రాజరాజేశ్వర పోచమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు శ్రీ కూన శ్రీనివాస్ గౌడ్ పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు డీసీసీ ఉప అధ్యక్షులు ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, డివిజన్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, ప్రేమ్, ఉదయ్ గౌడ్ లతో పాటు భక్తులు, మహిళలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం పీఎంల కంటే నేను తోపు


**మహిళా ఆశా కార్యకర్తపై సర్పంచ్ మండిపడు**

**"సీఎం, పీఎంల కంటే నేనే తోపు" అంటూ అహంకార పూరిత వ్యాఖ్యలు**

**కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు బాధితురాలి ఫిర్యాదు**

**రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం కటియాల కుంట తండాలో ఘటన**









**రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ప్రతినిధి ఆగస్టు 30 ( ప్రజా జ్యోతి )** గ్రామానికి ప్రథమ పౌరుడిగా ఉండి ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ఓ ప్రజాప్రతినిధి అహంకారం హద్దులు దాటింది. అట్టడుగు స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఓ మహిళా ఆశా కార్యకర్త పట్ల అత్యంత అసభ్యకరంగా, అవమానకరంగా ప్రవర్తించిన ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల పరిధిలోని కటియాల కుంట తండాలో వెలుగుచూసింది. సర్పంచ్ వేధింపులు భరించలేక బాధితురాలు న్యాయం కోసం ఏకంగా షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేను ఆశ్రయించారు. బాధితురాలు అందించిన లిఖితపూర్వక ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. కటియాల కుంట తండాకు చెందిన మేఘావత్ సరిత గత 12 సంవత్సరాలుగా గ్రామంలో ఆశా కార్యకర్తగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, అదే గ్రామానికి చెందిన సర్పంచ్ మూడవత్ రాంనాయక్ గత కొద్ది రోజులుగా ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, అవమానకరంగా మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు 26న పొరపాటున ఒక చిన్న మెసేజ్ ఫార్వర్డ్ అయిన దానికి సర్పంచ్ రాంనాయక్ ఆమెకు ఫోన్ చేసి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు.

**"సీఎం, పీఎంల కంటే నేనే గొప్ప.."**

ఫోన్‌లో సర్పంచ్ మాట్లాడుతూ.. "సీఎం రేవంత్ రెడ్డి, నరేంద్ర మోడీ కంటే నేనే తోపుని.. నా ముచ్చట వాళ్లతోనే ఉంటది" అంటూ తీవ్ర అహంకారంతో ప్రగల్భాలు పలికాడు. అంతటితో ఆగకుండా విధి నిర్వహణలో ఉన్న మహిళ అని కూడా చూడకుండా.. దుర్భాషలాడుతూ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతూ అత్యంత జుగుప్సాకరమైన పదజాలంతో దూషించాడు.

**ఆత్మగౌరవం దెబ్బతింది.. రక్షణ కల్పించండి**

సర్పంచ్ తీరుతో తాను తీవ్ర మనస్తాపానికి గురయ్యానని, ఒక మహిళా ఉద్యోగిగా

తన ఆత్మగౌరవానికి తీవ్ర భంగం వాటిల్లిందని సరిత ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రజాప్రతినిధి ఇలా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో మహిళా ఉద్యోగులు పని చేసే పరిస్థితి లేకుండా పోతోందని, తన విధి నిర్వహణకు తీవ్ర ఆటంకం కలుగుతోందని వాపోయారు. వెంటనే ఈ విషయంపై విచారణ జరిపించి, సర్పంచ్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. భవిష్యత్తులో తనపై ఇలాంటి దాడులు, అసభ్య ప్రవర్తన పునరావృతం కాకుండా తనకు రక్షణ కల్పించాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు.

**నా వద్ద సాక్ష్యాలున్నాయి..**

సర్పంచ్ రాజు నాయక్ తనను దూషించిన ఘటనకు సంబంధించి ప్రత్యక్షంగా, పరోక్షంగా తన వద్ద అన్ని సాక్ష్యాలు ఉన్నాయని, విచారణ సమయంలో వాటిని ఉన్నతాధికారుల ముందు ప్రవేశపెడతానని బాధితురాలు స్పష్టం చేశారు. సాక్షాత్తూ ఒక మహిళా ఆరోగ్య కార్యకర్తపై సర్పంచ్ ఈ స్థాయిలో విరుచుకుపడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఫిర్యాదుపై ఎమ్మెల్యే మరియు సంబంధిత ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారు? సర్పంచ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనేది వేచి చూడాలి.

# త్రిషుల్ బాక్స్ క్రికెట్ ను ప్రారంభించిన మాజీ మేయర్



**మేడిపల్లి(ప్రజా జ్యోతి):**మల్కాజ్గిరి కార్పొరేషన్ బోడుప్పల్ పరిధిలోఆదివారం రోజున త్రిషుల్ బాక్స్ క్రికెట్ ను నిర్వాహకులు వంశీ కృష్ణ ధీరజ్ కృష్ణ ల తోకలిసి బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం అజయ్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం ను ఇస్తాయి. కావున ప్రతిఒక్కరు ప్రతిరోజు ఒక గంట ఫిజికల్ ఫిటినెస్ పైన శ్రద్ధ చూపాలి అని కోరారు. ఈ కార్యక్రమం లోమాజీ డిప్యూటీ మేయర్ కొత్త కిషోర్ గౌడ్,11డివిజన్, 12డివిజన్ అధ్యక్షులతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త బేజాడి బ్రమ్మం తదితరులు పాల్గొన్నారు.

# బద్లావ్ జరూరి హై ర్యాలీకి బయలుదేరిన సిపిఐ కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జి గంటి సురేష్ కుమార్



**కొడంగల్ ఆగస్టు 30 ప్రజా జ్యోతి న్యూస్:** సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రాంలీల మైదానంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ, మహా ర్యాలీ కి బయలుదేరినట్లు సిపిఐ కోడంగల్ నియోజకవర్గ ఇన్చార్జ్ గంటి సురేష్ కుమార్ తెలిపారు. ఆదివారం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి ఫ్లైట్ లో బయలుదేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1న సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మార్పు అవసరం అనే నినాదంతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు, నిరుద్యోగం, పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతుల పంటలకు కనీసం మద్దతు ధర చట్టబద్ధమైన గ్యారెంటీ, కార్మిక హక్కుల రక్షణ, ఉపాధి కల్పన, ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడం, ప్రజాస్వామ్యం రాజ్యాంగ సంస్థల పరిరక్షణ వంటి అంశాలపై సిపిఐ పార్టీ ర్యాలీ నిర్వహిస్తుందని ఈ కార్యక్రమానికి రైతులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నట్టు తెలిపారు.

# వికారాబాద్ జిల్లాలో బిజెపి జెండా ఎగరవేయాలి

**బిజెపిలో యువతకు సముచిత స్థానం ఉంటుంది**

**జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన యు రమేష్ కుమార్**

**రమేష్ కుమార్ కు శుభాకాంక్షలు చెప్పిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి**





**తాండూరు ఆగస్టు 30 ప్రజా జ్యోతి :-** బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా తాండూర్ నియోజకవర్గానికి చెందిన యు రమేష్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. తాండూరు పట్టణం వీరశైవ ఫంక్షన్ హాల్ లో వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్ష పదవి బాధ్యతలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ పండుగ వాతావరణం లో బిజెపి పార్టీ జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టడంతో పాటు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ముందుకు వెళుతున్న బిజెపి తెలంగాణ రాష్ట్రంలో కూడా అధికారం చేపట్టనుందని చెప్పారు. గత 12 ఏండ్లుగా ప్రధాని నరేంద్ర మోడి,అమిషాల ల సారథ్యంలో దేశాన్ని అత్యంత శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. కరోనా కష్ట కాలంలో కూడ పేదలకు ఉచిత రేషన్ బియ్యం అందించి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. రానున్న ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టిన రమేష్ కుమార్ నేతృత్వంలో కార్యకర్తలందరూ కూడా సమిష్టిగా పనిచేసి తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్ రామ్,పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు బాలేశ్వర్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణ అధ్యక్షుడు స్థానిక కౌన్సిలర్ మల్లేశం, మహిళా నాయకురాలు అంతారం లలిత, సాహు శ్రీలత, విజయ్ కుమార్,కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న నల్ల బ్యాడ్జీల నిరసన, అక్టోబర్ 2న ఇందిరాపార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష



**కొడంగల్ ఆగస్టు 30 ప్రజా జ్యోతి న్యూస్** :తెలంగాణ రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) పరిధిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2.60 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల సామాజిక, ఆర్థిక భద్రత కోసం, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్న ప్రధాన డిమాండ్ తో, తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం (టీజీసీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమ కార్యాచరణకు పిలుపునిస్తున్నామని టి జి సి పి ఎస్ ఈ యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతి కుమార్ విలేకరులతో తమ కార్యాచరణ వివరాలు తెలుపుతూ సెప్టెంబర్ 1 – చీకటి దినం 2004 సెప్టెంబర్ 1 నుండి సీపీఎస్ విధానం అమల్లోకి వచ్చినందున, ఆ రోజును చీకటి దినంగా పరిగణిస్తూ, 2026 సెప్టెంబర్ 1న రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలియజేయాలని పిలుపునిస్తున్నాము. సంతకాల సేకరణ:లి సెప్టెంబర్ 1 తదుపరి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నాము. అక్టోబర్ 2 – సత్యాగ్రహ దీక్ష:లి మహాత్మా గాంధీ చూపిన అహింసా, సత్యాగ్రహ మార్గంలో, అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద శాంతియుత సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నాము.ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించి తక్షణమే సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

# రోడ్లపైనే డ్రైనేజీ పారుతుంటే అధికారులకు కనిపించడం లేదా

**ప్రజా సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం**

**శంషాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ ప్రదీప్ రెడ్డి**

**ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు శంషాబాద్ లో బీఆర్ఎస్ నాయకుల బస్తీ బాట**





**రాజేంద్రనగర్, ఆగష్టు 30 (ప్రజా జ్యోతి)** రోడ్లపైనే డ్రైనేజీ పారుతుంటే అధికారులకు కనిపించడం లేదా అని శంషాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ ప్రదీప్ రెడ్డి ప్రశ్నించారు. శంషాబాద్ డివిజన్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకునేందుకు నేరుగా శంషాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్ డివిజన్లో యాదవ్ బస్తీలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాలనీలో పర్యటించి ప్రజల్లో అడిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు కొలన్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో స్థానిక ప్రజలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ అనేకమార్లు అధికారులకు స్థానికులు విన్నవించిన ఇప్పటికీ పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమై రోడ్లపై ఎక్కడ చూసినా పొంగిపొర్లుతుందన్నారు. దీనివల్ల కాలిన ఊర్లో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. శానిటేషన్, మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, మున్సిపల్ నీటి సరఫరా సమస్యలపై జిహెచ్ఎంసి అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలవకుండా చూడాలన్నారు.ప్రజల సమస్యలను కేవలం తెలుసుకోవడమే కాకుండా వాటి పరిష్కారం కోసం అధికారులను నిరంతరం ప్రశ్నించి సమస్యలను పరిష్కరించడమే బస్తీ బాట లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై జిహెచ్ఎంసి అధికారులు స్పందించి పనులు చేయకపోతే జిహెచ్ఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ మహేష్ యాదవ్, జనరల్ సెక్రటరీ రాహుల్ అప్ప, వెంకటేష్, లక్ష్మణ్ , లీగల్ సెల్ అధ్యక్షుడు జయకృష్ణ గౌడ్, బిసి సెల్ అధ్యక్షుడు అర్జున్, యూత్ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, సీనియర్ నాయకులు ప్రభాకర్, రాజు, వాజిద్, రవి, సీనియర్ నాయకులు జగదీష్ గౌడ్, శ్రీనివాస్, నాయక్, ప్రవీణ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్యకు తక్షణ పరిష్కారం

**కౌన్సిలర్ చొరవతో సరఫరా పునరుద్ధరణ**



**చేవెళ్ల ఆగస్టు 30(ప్రజా జ్యోతి):**మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు దేవుని ఎర్రవల్లిలోని ఓ గల్లీలో తాగునీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ కరికే మీనాక్షి సత్యనారాయణ వెంటనే స్పందించారు. సంబంధిత సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నీటి సరఫరా పునరుద్ధరించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించిన కౌన్సిలర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మీనాక్షి సత్యనారాయణ మాట్లాడుతూ.. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి ప్రాధాన్యమిస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

# శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి పోచమ్మ దేవి బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొన్న దుండిగల్ పురపాలక తొలి చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 30(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ దుండిగల్ డివిజన్ లోని శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి పోచమ్మ దేవి బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొన్న దుండిగల్ పురపాలక తొలి చైర్ పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి క్రిష్ణ . ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వరి పోచమ్మ దేవి బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, జక్కుల కృష్ణా యాదవ్ (ఆలయ కమిటీ చైర్మన్), జక్కుల శ్రీనివాస్ యాదవ్, అమరం గోపాల్ రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, ప్యాక్స్ డైరెక్టర్లు ఈ శ్రీనివాస్, అర్కల జీతయ్య ముదిరాజ్, మరియు స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

పటాన్చెరువు నియోజకవర్గం జిన్నారం మున్సిపాలిటీ జిన్నారంలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కుత్బులపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ . ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శ్రీ పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ విష్ణు వర్ధన్ రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ జీతయ్య, ఆలయ కమిటీ సభ్యులు లింగం, నర్సింగ్ రావు, వెంకటేష్, మందా రమేష్, శేఖర్, శ్రీనివాస్ గౌడ్, నిఖిల్, పెంటయ్య మరియు స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# మూసి ప్రక్షాళనకు గోదావరి జలాలే పరిష్కారం

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి– వ్యవసాయాన్ని కాపాడాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

రెండో రోజు కొనసాగిన సీపీఎం పాదయాత్రకు మేడ్చల్ నాయకుల ఘన స్వాగతం




**మేడిపల్లి (ప్రజా జ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడి దశాబ్ద కాలం పూర్తవుతున్నా సాగు, తాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులకు తక్షణమే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన గడువు ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అసంపూర్తి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలనే డిమాండ్‌తో సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ చేపట్టిన పాదయాత్ర రెండో రోజు ఘట్కేసర్, మేడిపల్లి మీదుగా ఉప్పల్‌కు చేరుకుంది. బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో జహంగీర్ మాట్లాడారు.వ్యవసాయాధారిత యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగునీటి వసతులు లేక లక్షలాది మంది చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బునాదిగాని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పనులకు నిధులు కేటాయించకపోవడంతో అవి మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. బస్వాపూర్, గంధమల్ల, చర్లగూడెం వంటి బహుళార్థసాధక ప్రాజెక్టులు నిధుల కొరతతో పెండింగ్‌లో ఉండటం వల్ల జిల్లాకు సాగు, తాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నవాబుపేట రిజర్వాయర్ నుంచి గుండాల మండలానికి, అశ్వరాయిపల్లి నుంచి ఆలేరు ప్రాంతానికి నీరందించేందుకు నిర్మించిన కాల్వల్లో 15 ఏళ్లకు పైగా నీరు ప్రవహించక గడ్డి మొలిచి శిథిలావస్థకు చేరాయని అన్నారు. నారాయణపురం, చౌటుప్పల్ ప్రాంతాలకు కీలకమైన రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఎందుకు ముందుకు సాగడం లేదో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆసిఫ్‌నగర్, బృందావనం కాల్వలను పునరుద్ధరించాలని కోరారు. లి మూసి ప్రక్షాళనకు గోదావరి జలాలే పరిష్కారం మూసి సుందరీకరణ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు కార్పొరేట్ లాభాలకే పరిమితమవుతున్నాయా అన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని జహంగీర్ అన్నారు. భువనగిరి ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని విషపూరిత మూసి నీరు ప్రభావితం చేస్తోందని వారికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మూసి పరివాహక ప్రాంతానికి గోదావరి జలాలు అందించడం ద్వారానే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. మూసి ప్రక్షాళనతో పాటు గోదావరి జలాల అనుసంధానానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లాలోని షామీర్‌పేట్ చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి, అక్కడి నుంచి యాదాద్రి భువనగిరి ప్రాంతానికి గోదావరి జలాలు అందించే ప్రతిపాదనను అమలు చేయాలని కోరారు. పాదయాత్రకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ, ఘట్కేసర్ మండల కమిటీ, మేడిపల్లి మండల కమిటీ నాయకులు ఘన



స్వాగతం పలికారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి వేలాది మంది రైతులు పాదయాత్రకు సంఘీభావంగా తరలివస్తారని జహంగీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ,డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అవనగంటి వెంకటేష్,సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేశ్, వనం ఉపేందర్ లు పాల్గొన్నారు. పాదయాత్ర బృందానికి స్వాగతం పలికిన వారిలో సీపీఎం మేడ్చల్ జిల్లా నాయకులు చింతల యాదయ్య,ఘటకేసర్ నాయకురాలు సబితా, మేడిపల్లి మండల కార్యదర్శి ఎన్.సృజన,కర్రె జంగయ్య,కుమార్, అంజయ్య గౌడ్, పాపయ్య, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

# బాహ్య మూల్యాంకనం పేరుతో టీచర్లకు టార్చర్

ప్రాథమిక పాఠశాలల దుస్థితి పట్టించుకోని రాష్ట్ర సర్కారు

పిల్లల చదువు కంటే రికార్డులే ఎక్కువా?

ఎస్‌జిటియు రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి పండుగ అంజయ్య

**తలకొండపల్లి,ఆగస్టు 30 (ప్రజాజ్యోతి):** పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోకుండా ఎస్ఏ–1,ఎస్ఏ–2 పరీక్షలకు బాహ్య మూల్యాంకనం పేరుతో ప్రభుత్వం మరో కొత్త ఒత్తిడిని తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ఎస్‌జిటియు రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి పండుగ అంజయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రాథమిక పాఠశాలల్లో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారని గుర్తు చేశారు.ఒకే ఉపాధ్యాయుడు రెండు,మూడు, నాలుగు తరగతులను చూసుకోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు.అనేక విషయాలను బోధించడంతో పాటు ఎఫ్ఎల్ఎన్ వంటి కీలక కార్యక్రమాలను ఉపాధ్యాయులే అమలు చేయాలని కొనియాడారు. రికార్డులు, యాప్‌లు, నివేదికలు, మధ్యాహ్న భోజనం,యూనిఫాం,పాఠ్యపుస్తకాల పంపిణీ వంటి బోధనేతర పనులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. పరిమిత వనరులతో పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతిరోజూ ఉపాధ్యాయులు శ్రమించాల్సి వస్తుందని గుర్తు చేశారు.ఇన్ని బాధ్యతలను మోస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిపై మళ్లీ బాహ్య మూల్యాంకనం పేరుతో ఒత్తిడి పెంచడం వల్ల తీవ్ర మానసిక వేధింపులకు గురవుతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకటి లేదా ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలో నాణ్యమైన విద్య విద్యార్థులకు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు.ఉపాధ్యాయుల సంఖ్య పెంచకుండా,ఖాళీలను భర్తీ చేయకుండా,బోధనేతర పనులను తగ్గించకుండా కేవలం పరీక్షల మూల్యాంకన విధానాన్ని మార్చితే విద్యా ప్రమాణాలు పెరగవని వాపోయారు.పిల్లల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలంటే ముందుగా ఉపాధ్యాయుడికి బోధించడానికి అవసరమైన సమయం, సిబ్బంది, వనరులు,ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని



ఎస్‌జిటియు రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి పండుగ అంజయ్య డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుడిని ఒత్తిడికి గురిచేసి నాణ్యమైన విద్యను సాధించలేమని,ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్‌జిటియు రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి పండుగ అంజయ్య విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహనీయుల ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

**అల్వాల్ ఆగస్టు 30 (ప్రజా జ్యోతి)** అల్వాల్ అంబేద్కర్ నగర్ కాలనీలో మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాలకు ఆదివారం 168వ జ్ఞానమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఫైర్ సర్వీస్ అధికారి, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర నాయకులు ఎం.ఆర్. ప్రేమ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ అధ్యక్షులు సానహుల్లా ఖాన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, గద్దర్ సమాజంలో సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం చేసిన కృషిని ప్రజలు స్మరించుకోవాలని అన్నారు. సమాజంలో అసమానతలను తొలగించి, ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు మహనీయుల ఆశయాలను ముందుకు



తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే సనాతన ధర్మం పేరుతో ప్రజలపై ఆచారాలు, భావజాలాలు ఏ విధంగా రుద్దబడుతున్నాయనే అంశంతో పాటు భారత రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షించుకోవాలనే విషయాలపై వారు వివరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అనంతరం పూలే, అంబేద్కర్, గద్దర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సి.ఎల్. యాదగిరి, జీ. రాజయ్య, మూర్తి, సాగర్, కే. శ్రీనివాస్, సురేష్, సి. మహేందర్, చిత్తయ్య, ఎచ్.ఎం.టి. రమేష్, నరసింహ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షులు సి.ఎల్. యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు.

# మధు కలెక్షన్ గ్రాండ్ ఓపెనింగ్ ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,ఆగస్టు,30,ప్రజాజ్యోతి:** డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన “మధు కలెక్షన్” 1 గ్రాము ఇమిటేషన్ జ్యువెలరీ షోరూమ్ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భం గా షోరూమ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వినియోగదారులకు నాణ్యమైన డిజైన్లు, అందుబాటు ధరల్లో ఆభరణాలను అందించాలని ఆకాంక్షించారు.మధు కలెక్షన్ లో వివిధ రకాల 1 గ్రాము ఇమిటేషన్ జ్యువెలరీ, ట్రెండీ ప్రత్యేక డిజైన్లు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను కూడా ప్రకటించారు.ఈ కార్యక్రమం లో షోరూమ్ నిర్వాహకులు, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నూతన దంపతులకు చీఫ్ విప్ ఆశీస్సులు

రావులపల్లి సర్పంచ్ కొడుకు పెండ్లికి పట్నం మహేందర్‌రెడ్డి



**చేవెళ్ల ఆగస్టు 30(ప్రజా జ్యోతి):** రావులపల్లి గ్రామ సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్ కొడుకు ప్రశాంత్ గౌడ్––తేజస్వినీ పెండ్లి వేడుక మల్కాపూర్ గేటు వద్ద పద్మావతి కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వారు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఖానాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

ఎంపీ నిధులతో రూ.5 లక్షల వ్యయం



**చేవెళ్ల ఆగస్టు 30(ప్రజా జ్యోతి):** ఖానాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎంపీ నిధుల కింద మంజూరైన రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ గజ్జగాని సింధూర వెంకటేష్, ఉప సర్పంచ్ ఇందిరమ్మ, వార్డు సభ్యులు పనులకు శ్రీకారం చుట్టారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామస్థులకు రాకపోకల సౌకర్యం మెరుగుపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామ అధ్యక్షుడు కొత్తకాపు గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు మొగిలిగిద్ద సత్యనారాయణరెడ్డి, బీజేపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# శంషాబాద్ తొండుపల్లిలో ట్రాఫిక్ పోలీసుల వాహనాల తనిఖీలు

ఇన్నోవా వాహనాన్ని తనిఖీ చేయగా నంబర్ ప్లేట్ మార్చినట్లు గుర్తింపు

టాక్సీ నెంబర్ ప్లేట్ కు బదులు, ప్రైవేట్ నెంబర్ ప్లేట్

ఇన్నోవా వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ను ఆర్జీఐఏ పోలీసులకు అప్పగింత

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు







**రాజేంద్రనగర్, ఆగస్టు 30 (ప్రజా జ్యోతి)** టాక్సీ నెంబర్ ప్లేట్ తో ఉండాల్సిన ఇన్నోవా కారు కు డ్రైవర్ ప్రైవేట్ నెంబర్ ప్లేట్ బిగించి పోలీసులకు తప్పించుకుని తిరుగుకుంటూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబట్ట ఘటన శంషాబాద్ తొండుపల్లిలో చోటు చేసుకుంది. శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తొండుపల్లిలో శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తుండుపల్లిలోని ఇండియానా బేకరీ వద్ద ఒక ఇనోవా (టీూ 34ాూ 1794) కారును ఆపి తనిఖీలు నిర్వహించగా విలువ వాహనం యొక్క అసలు రిజిస్ట్రేషన్ నంబర్ (టీూ 34 ాూ 1794) టాక్సీ ఫోన్ నెంబర్ ప్లేట్ వాహనం ఓనర్ రమేష్ పేరుతో రిజిస్ట్రేషన్ అయి ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ది వాహనానికి ఏర్పాటు చేయవలసిన అసలు టాక్సీ నంబర్ ప్లేట్ ని తొలగించి దాని స్థానంలో ప్రైవేటు వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు అమర్చి తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ట్రాఫిక్ చాలన్ మరియు పెండింగ్ లో ఉన్న ఈఎంఐ బకాయిలను తప్పించుకునే ఉద్దేశంతో వాహనం యొక్క నెంబర్ ప్లేట్ ను అక్రమంగా మార్చి తిరుగుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం ముర్తుజాపల్లికి చెందిన రమేష్ హైదరాబాద్ కర్మన్ ఘాట్ లో నివాసం ఉంటూ ఇనోవా టాక్సీ నడుపుకుంటూ ఉన్నాడు. ఇనోవా డ్రైవర్ రమేష్ ను అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేసి ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కౌకూర్ మోడల్ మార్కెట్ కోసం నాలుగో రోజు ధర్నా

ప్రజా అవసరాలకే భవనం.. ఎక్సైజ్ కార్యాలయానికి కాదు



**అల్వాల్, ఆగస్టు 30 ( ప్రజా జ్యోతి):** కౌకూర్‌లోని మోడల్ మార్కెట్ భవనాన్ని ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు చేపట్టిన నిరసన ఆదివారం నాలుగో రోజుకు చేరింది. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో స్థానికులు, వివిధ కాలనీల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు.
మోడల్ మార్కెట్ భవనంలో ఎంఎంసీ వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా అవసరాల కోసం నిర్మించిన భవనాన్ని ఇతర శాఖకు కేటాయించడం సరికాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తుడిమెళ్ల మల్లికార్జున్ మాట్లాడుతూ.. కౌకూర్ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మోడల్ మార్కెట్ భవనాన్ని వినియోగించాలని కోరారు. ఎక్సైజ్ శాఖకు చేసిన కేటాయింపును వెంటనే రద్దు చేసి ఎంఎంసీ వార్డు కార్యాలయం ఏర్పాటు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజల ఐక్యతే తమ బలమని అన్నారు. కార్యక్రమంలో టీ. వేణుగౌడ్, ఆసిఫుల్లాఖాన్, శివరాజ్, కృష్ణ, శ్రీకాంత్, చందు, బలవంత్, హరీష్, ఆరిఫ్‌ఖాన్, జలీల్, సాదిక్, పుష్ప, మంజుల, సంధ్య, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు. కౌకూర్ ప్రజల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

# సజావుగా సాగిన నీటి ప్రవేశ పరీక్ష.

మద్యం సేవించి పరీక్షకు హాజరైన అభ్యర్థి

అభ్యర్థిని అదుపులోకి తీసుకున్న పోలీసులు






**ఇబ్రహీంపట్నం ఆగస్టు 30 ప్రజా జ్యోతి:** శేరిగూడలో ఐఓఎన్ కేంద్రంలో పోలీస్ బందోబస్తు నడుమ నీట్ పీజీ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష, టాటా ఐఓఎన్ డిజిటల్ కేంద్రంలో పోలీస్ బందోబస్తు నడుమ సజావుగా నిర్వహించారు. పరీక్ష సజావుగా సాగుతున్న వేళ హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ రిజ్వాన్ అనే అభ్యర్థి, మద్యం సేవించిన నీట్ పీజీ పరీక్ష రాసేందుకు పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించిన అనంతరం అభ్యర్థి మద్యం సేవించిన హాల్లోకి వచ్చినట్లు ఇన్విజిలేటర్ గుర్తించారు. అతని తీరును గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై పరీక్ష రాయడానికి అనుమతించలేదు. పరీక్ష హాల్ నుంచి బయటకు పంపించారు. నీట్ పీజీ వంటి కీలకమైన ప్రవేశ పరీక్షకు మద్యం సేవించి రావడంతో పరీక్ష కేంద్రం వద్ద కొంతసేపు కలకలం నెలకొంది. పరీక్షా నిబంధనల ప్రకారం అభ్యర్థిని పరీక్షకు దూరంగా ఉంచారు. ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

# భారీ వర్షానికి కూలిన పాత భవనం గోడ

పార్కింగ్‌లో ఉన్న వాహనాలకు నష్టం.. బాధ్యత ఎవరిదన్న ప్రశ్న





**బోయిన్ పల్లి, ఆగస్టు 30.(ప్రజా జ్యోతి):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బలం రాయి ప్రాంతంలో పాత భవనం ప్రహరీ గోడ కూలిపోయింది. కంటోన్మెంట్ వార్డు నంబర్ 3లోని క్లాసిక్ గార్డెన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గోడ కూలిన సమయంలో అక్కడ పార్కింగ్ చేసి ఉన్న పలు వాహనాలు దెబ్బతిన్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. పాత భవనానికి సంబంధించిన ఖాళీ స్థలాన్ని క్లాసిక్ గార్డెన్ పార్కింగ్ కోసం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే గోడ కూలడంతో వాహనాలు దెబ్బతినడంతో వాటికి జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహించాలన్న ప్రశ్న తలెత్తుతోంది. పార్కింగ్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న యాజమాన్యమా? లేక పాత భవనానికి సంబంధించిన స్థల యజమానులా? అన్నది తేలాల్సి ఉంది. పాత భవనం, ప్రహరీ గోడ పరిస్థితిపై ముందస్తుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారా? ప్రమాదకరంగా ఉన్న గోడ వద్ద వాహనాలను పార్కింగ్‌కు అనుమతించారా? అనే అంశాలపై కూడా విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈవో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా కంటోన్మెంట్ పరిధిలో ప్రమాదకర స్థితిలో ఉన్న పాత భవనాలు, ప్రహరీ గోడలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ ఆలయ రెండో వార్షికోత్సవం



**మచ్చబొల్లారం, ఆగస్టు 30 ( ప్రజా జ్యోతి ):** మచ్చబొల్లారం కృష్ణానగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ రెండో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి రేణుక ఎల్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీర్వాదాలు పొందుతూ కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేష్, సెక్రటరీ అశోక్ కుమార్, కమిటీ సభ్యులు ఏ. సంతోష్ కుమార్, జి. సైట్, శేఖర్, నితిన్ కుమార్, సాయికుమార్, సాయినాథ్, జి. యాదగిరితో పాటు జేసీ సురేందర్ రెడ్డి, నార్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి చిలుకానగర్ శాఖ కన్వీనర్ గా సీకూరి శివనందు (లయన్)



**ఉప్పల్,ఆగస్టు30,ప్రజాజ్యోతి:** సెంట్రల్ కమిటీ ఆదేశాల మేరకు భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి చిలుకానగర్ శాఖ కన్వీనర్ గా భజరంగ్ దళ్ ప్రముఖ్ సీకూరి శివనందు (లయన్ నాని)ను నియమించిన ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ ఏనుగు రాజి రెడ్డి ఈ సందర్భంగా శివనందు మాట్లాడుతూ తనపై నమ్మకంతో భాద్యతలు అప్పగించిన సెంట్రల్ కమిటీ అధ్యక్షులు రాఘవరెడ్డి కి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ కి, కార్యదర్శి మల్కాజిగిరి పార్లమెంటు ప్రభారి నాయిని బుచ్చి రెడ్డి కి ,సెంట్రల్ కమిటీ సభ్యులు ఇంద్రాల రమేష్ కు పార్లమెంట్ కోకన్వీనర్ గోనె శ్రీకాంత్ కు ధన్యవాదాలు తెలుపుతూ రాబోయే గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, అలాగే మండప నిర్వాహకులకు ఉత్సవ సమితీ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు..! ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చిలుకానగర్ డివిజన్ కన్వీనర్ శివనందు అన్నారు..!

# కాలభైరవ ఆలయంలో గోశాల నిర్మాణ పనులు పూర్తి

దాతలకు ధన్యవాదాలు తెలియజేసిన ఆలయ కమిటీ



**ఉప్పల్,ఆగస్టు30,ప్రజాజ్యోతి** :ఉప్పల్ బగాయత్తులో స్వయంభూగా వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయం నందు నూతన గోశాల నిర్మాణం పూర్తి కావడం విశేషం, స్వామివారి కృపతో గోశాల నిర్మాణం పూర్తికావడం ఆనందకరమైన విషయం. ఈ పుణ్యకార్యానికి సహకరించిన దాతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన అర్చకులు కన్నయ్య పంతులు రామకృష్ణ పంతులు ఆలయ కమిటీ, అలాగే భక్తులకు దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

# సీనియర్ సిటిజన్ల క్రీడా ప్రతిభ స్ఫూర్తిదాయకం



**అల్వాల్ ఆగస్టు 30 (ప్రజాజ్యోతి)** వయస్సును లెక్కచేయకుండా సీనియర్ సిటిజన్లు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటూ తమ ప్రతిభను చాటుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన "మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ ఆఫ్ సీజన్ మీట్--2026" కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వయస్సు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగిస్తూ క్రీడలపై ఆసక్తిని పెంచుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు వయస్సును అధిగమించి క్రీడా పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించడం అభినందనీయమన్నారు. వారి కృషి, పట్టుదల యువతకు సైతం ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందించడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభు కుమార్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# దుండిగల్‌లో ఘనంగా రాజరాజేశ్వర పోచమ్మ తల్లి బోనాల పండుగ



**దుండిగల్, ఆగస్టు 30(ప్రజా జ్యోతి )** దుండిగల్‌లో రాజరాజేశ్వర పోచమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు శ్రీ కూన శ్రీనివాస్ గౌడ్ పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు డీసీసీ ఉప అధ్యక్షులు ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, డివిజన్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, ప్రేమ్, ఉదయ్ గౌడ్ లతో పాటు భక్తులు, మహిళలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిజాంపేట్లోని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి కాపాడండి.

సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్



**కుత్బుల్లాపూర్ ఆగష్టు 30(ప్రజా జ్యోతి )** బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ సర్వే నెంబర్ 103లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఐ ఆధ్వర్యంలో బాచుపల్లి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లుకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని అనేక చోట్ల ప్రభుత్వ భూమిని సర్వే నెంబర్లను తరుమారు చేసి కొంతమంది కబ్జాదారులు కబ్జా చేయడం సర్వసధారం అయింది. అని అన్నారు. అదే విధంగా నిజాంపేట్ సర్వే నెంబర్ 103ను కూడా తప్పుడు పత్రాలతో రిజిస్టేషన్ చేసుకొని ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేశారు అని అన్నారు. నిజాంపేట్ సర్వే నెంబర్ 102,103 మధ్యలో సర్వే నెంబర్ 104 లో కొంత బిట్టు ఎలా ఉంటది అని ప్రశ్నించారు. కనుక కబ్జా అయినా ప్రభుత్వ భూమిని వెంటనే కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ ఏఐటీయూసీ కార్యదర్శి ఆశి. యాదయ్య, కన్వీనర్ పొన్నకంటి దస్తగిరి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# చర్చి పాస్టర్ కృపాకర్ పాల్ మృతి పట్ల గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు సంతాపం . కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం.





**యాలాల ఆగస్టు 30 ప్రజా జ్యోతి** యాలాల మండలం దేవనూర్ గ్రామానికి చెందిన చర్చి పాస్టర్ కృపాకర్ పాల్ మరణించారన్న వార్త తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు చర్చి వద్దకు వెళ్లి పాస్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాస్టర్ కృపాకర్ పాల్ మృతి గ్రామానికి తీరని లోటని, ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. బాధిత కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేసి మనోధైర్యాన్ని కల్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కిరణ్ కుమార్, మెట్లి కృష్ణ, వి.గోపాల్, మైమొద్, రతన్ నాయక్,బోడ్కా శ్రీను,కర్వ రమేష్, నర్సిములు, తదితరులు పాల్గొని పాస్టర్ కుటుంబానికి సానుభూతి తెలిపారు.????

# వంకరటింకర రోడ్డు ఎందుకు?

## హైదరాబాద్--బీజాపూర్ హైవే పనులపై కిషన్‌రెడ్డి ఫైర్

అధికారులను నిలదీసిన కేంద్ర మంత్రి.. ప్రమాదాల ముప్పుపై ఆగ్రహం

**చేవెళ్ల ఆగస్టు 30(ప్రజా జ్యోతి):** హైదరాబాద్--బీజాపూర్ జాతీయ రహదారి పనుల తీరుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. చేవెళ్ల పరిధిలో జరుగుతున్న హైవే పనులను ఆయన పరిశీలించారు. పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు వంకరటింకరగా ఉండటం, మలుపులు ఎక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి రహదారితో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. భూసేకరణ పరిస్థితిపై కూడా అధికారులను ప్రశ్నించారు. రోడ్డు పనుల విషయంలో మంత్రి అడిగిన ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకపోవడంతో ఆయన సీరియస్ అయ్యారు. హైవే పనులపై హైదరాబాద్‌లో అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు.

**సర్వీస్ రోడ్డు సమస్యపై రైతుల ఫిర్యాదు**

రహదారికి ఇరువైపులా ఎత్తు ఎక్కువగా ఉండటంతో ఒకవైపు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి, మరోవైపు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పొలాలకు వెళ్లేందుకు రాకపోకల సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు.






రైతుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. హైదరాబాద్--బీజాపూర్ హైవే పనులపై సమగ్ర సమీక్ష నిర్వహించి, పనుల జాప్యానికి కారణాలను తెలుసుకుంటామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, అత్తిలి మనీషా అనంత్ రెడ్డి, నేషనల్ హైవే అధికారులు, ప్రజా ప్రతినిధులు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ

## ఈ ఏడాది చివరికల్లా పనులు పూర్తి చేస్తాం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 30( ప్రజా జ్యోతి):** వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేసి ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఆదివారం వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆయన సందర్శించి కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్‌లో జరుగుతున్న పనుల పురోగతిని రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి.. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను సుమారు రూ.27 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రైలు ప్రమాదాల నివారణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో 'కవచ్' సాంకేతికతను అమలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో బుల్లెట్ ట్రైన్ తెలంగాణకు వస్తే రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచే అవకాశం ఉందన్నారు. బుల్లెట్ ట్రైన్ వంటి ఆధునిక రవాణా వ్యవస్థలతో రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు.

**పెరగనున్న పార్కింగ్ సౌకర్యాలు:** వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో



ప్రయాణికుల సౌకర్యార్థం ఫోర్ వీలర్ పార్కింగ్‌ను 50 వాహనాలకు, టూ వీలర్ పార్కింగ్‌ను 150 వాహనాలకు పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. స్టేషన్‌లో రెండు ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులు, క్యాంటీన్, దివ్యాంగులకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పూర్తయిన తర్వాత ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత సౌకర్యవంతంగా ప్రయాణించగలుగుతారని అన్నారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని పేర్కొన్నారు.

**అండర్ బ్రిడ్జి సమస్యకు పరిష్కారం :** వికారాబాద్‌లోని అండర్ బ్రిడ్జి సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి కేంద్ర రైల్వే మంత్రితో చర్చించి సమస్యకు పరిష్కారం చూపుతామని కిషన్ రెడ్డి తెలిపారు. అలాగే జాతీయ రహదారి పనులను కూడా అతి తక్కువ సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో



రైల్వే మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తయితే వికారాబాద్ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ ఆర్. గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, బీజేపీ రాష్ట్ర సెల్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, రమేష్, కేయస్. రత్నం, ఎమ్మార్వో లక్ష్మీనారాయణతో పాటు రైల్వే, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నాపరతి గనులతో ఎంతమందికి ఉపాధి అవకాశాలు

## నాపరాతి వ్యాపారుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**తాండూరు ఆగస్టు 30 ప్రజా జ్యోతి :-** తాండూర్ ప్రాంతానికి నాపరాతి పరిశ్రమలు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తాండూరు పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రితో తమిళ మనోహర్ రెడ్డి పలు అంశాలపై సమక్షించారు.ముఖ్యంగా ఈ ప్రాంతం మైనింగ్ పరిశ్రమలు అధికంగా ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఎంతో మంది కార్మికులు జీవనోపాధి పొందుతూన్నారని తెలిపారు.నాపరాతి పరిశ్రమలపై వేలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలను భారీ పరిశ్రమలుగా రూపాంతరం చేసే విధంగా తీసుకొస్తున్న నూతన నిబంధనలతో తాండూర్‌లోని నాపరాతి పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని కేంద్ర మంత్రి ముందు ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నతరహా పరిశ్రమలు భారీ పరిశ్రమలుగా మారితే స్థానిక నాపరాతి వ్యాపారులు అదనపు ఆర్థిక భారాన్ని ఎదుర్కొని నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని మంత్రితో అన్నారు.అదేవిధంగా రాయల్టీ చార్జీలు కూడ అధికంగా పెరగడంతో వ్యాపారులపై అదనపు భారం పడటమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం



ఉందన్నారు. నాపరాతి పరిశ్రమలు దెబ్బతింటే వ్యాపారులు నష్టపోవడంతో పాటు వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఫలితంగా చాలామంది వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.

తాండూర్ ప్రాంత ప్రజలు, నాపరాతి వ్యాపారులు, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నాపరాతి పరిశ్రమలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం మంత్రి కిషన్ రెడ్డిని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కోరారు.ఈ మేరకు నాపరాతి పరిశ్రమల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిశ్రమలను పరిరక్షించాలని కోరుతూ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో



స్థానిక ప్రజా ప్రతినిధులు పలువురు వ్యాపారులు ఉన్నారు.

# గ్రామా అభివృద్ధియే ప్రథమ లక్ష్యం

గ్రామ సర్పంచ్ నరసింహ నాయక్



**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి)** ఆగష్టు 30 : వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని వాల్య నాయక్ తండాలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశానుసారం గ్రామ సర్పంచ్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ మహిళ సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించడం జరిగింది.ఈ పూజా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసింహ నాయక్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని అన్నారు.గ్రామంలోని మహిళలకు ఒక ప్రత్యేకమైన వేదిక అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు,డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రామచందర్,శారద,ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య,రాములు,లోక్య,హనుమంతు,శ్రీనివాస్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# అన్నా--చెల్లెల అనుబంధం

అన్నకు రాఖీ కట్టి ఆప్యాయత చాటిన చెల్లెలు



**బషీరాబాద్, ఆగస్టు 30 (ప్రజా జ్యోతి):** అన్నా--చెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను జీవన్గి గ్రామానికి చెందిన గౌతమి ఆప్యాయంగా జరుపుకుంది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామానికి చెందిన కొనిగేరి లక్ష్మీ నర్సింలు కుమార్తె గౌతమి, తాండూర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ హాస్టల్‌లో చదువుతున్న తన అన్న హర్షవర్ధన్‌కు రాఖీ కట్టింది. అనంతరం అన్నకు స్వీట్స్ తినిపించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా అన్నా--చెల్లెల మధ్య ఉన్న ఆప్యాయత, అనురాగం ప్రతిబింబించింది.

# గడిసింగపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు -- ఇద్దరికి తీవ్ర గాయాలు, వికారాబాద్ ఆస్పత్రికి తరలింపు



**పరిగి, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి):** వికారాబాద్ జిల్లా పరిగి మండలం గడిసింగపూర్ సమీపంలోని చింతల చెరువు వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

మృతులను ఖాజా బీ (65), జహంగీర్ బీ (78)గా గుర్తించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని స్థానికులు, పోలీసులు వెంటనే రక్షించి మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో సంఘటన స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బాధితుల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## బిజినెస్

### త్వరలో అంతర్జాతీయ మార్కెట్లోకి లలితా జువెలరీ

**దక్షిణాది రాష్ట్రాల్లో కొత్తగా 110 స్టోర్లు**



తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) పూర్తి చేసుకున్న ఆభరణాల విక్రయ సంస్థ లలితా జువెలరీ మార్ట్ లిమిటెడ్ వ్యాపార విస్తరణపై పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతోందని సంస్థ సీఎండీ ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. శనివారమిక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో రిటెయిల్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించడంతోపాటు, అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం తమకు 64 షోరూములున్నాయని, వీటికి అదనంగా మరో 110 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. 2027 మార్చి నాటికి కనీసం 10 స్టోర్లకు పైగా ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. దక్షిణాదిలో 175 షోరూములకు చేరుకోగానే ఉత్తర భారత్‌కు విస్తరిస్తామని వెల్లడించారు. ఇందులో తొలుత మహారాష్ట్ర, ఆ తర్వాత ఉత్తరప్రదేశ్, దిల్లీ మార్కెట్లు ఉంటాయన్నారు.

**మలేషియా, సింగపూర్‌లో..:** వచ్చే 2-3 నెలల్లో మలేషియాలో షోరూమును ప్రారంభించ బోతున్నట్లు కిరణ్ కుమార్ వెల్లడించారు. ఆ తర్వాత సింగపూర్ మార్కెట్లోకి అడుగుపెడ తామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఉన్న భారతీయ, ఆసియా వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలను, అత్యుత్తమ ధరకే అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

**విక్రయాలు పెంచుకుంటూ...:** అధిక లాభాలు ఆశించకుండా, తక్కువ లాభంతో ఎక్కువ విక్రయాలు సాధించడమే సంస్థ ప్రధాన వ్యూహమని ఆయన వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 58 షోరూముల ద్వారా రూ.25,000 కోట్ల మొత్తం ఆదాయం, రూ.1,000 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో స్టోర్ల సంఖ్య పెరిగిన కొద్దీ విక్రయాల విలువ మరింత వృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమకు 9 లేదా 14 క్యారెట్ల బంగారం విక్రయించే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. 22 క్యారెట్ల పసిడి ఆభరణాలనే విక్రయిస్తామన్నారు. తమ వద్దకు వస్తున్నవారిలో 60% పాత బంగారం మార్పిడి చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

**పసిడి ధరలపై..:** 'నేను వ్యాపారం మొదలుపెట్టినప్పుడు గ్రాము రూ.280 ఉండేది. కరోనా సమయంలో కిలో బంగారం రూ.48 లక్షలకు చేరింది. ఇప్పుడు దాదాపు రూ.1.63 కోట్ల దరిదాపుల్లో ఉంది. బంగారం ధర ఎప్పుడూ వృద్ధి దశలోనే ఉంటుంది. కాబట్టి, పసిడిని అత్యంత సురక్షితమైన సాధనంగా చూడాల'ని ఆయన సూచించారు.

# మరింత మందికి ఈపీఎఫ్..
# అక్టోబర్ 31 వరకు 'ప్రత్యేక' ఛాన్స్




ప్రైవేటు రంగ ఉద్యోగులకు ఉపయోగపడే కీలక నిర్ణయాన్ని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తీసుకుంది. ఇంతకాలం అర్హత ఉన్నప్పటికీ ఈపీఎఫ్ పరిధిలోకి రాని ఉద్యోగులను నమోదు చేసేందుకు 'ఎంప్లాయీస్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపెయిన్ 2026'ను ప్రారంభించింది. గతంలో మిగిలిపోయిన నమోదు, కాంప్లయన్స్ లోపాలను సరిదిద్దడంతోపాటు మరింత మంది ఉద్యోగులకు పీఎఫ్, పెన్షన్, బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

**అక్టోబర్ 31 వరకు అవకాశం**

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ 2026 జూన్ 29న జుజుజ-2026ను నోటిఫై చేసింది. ఈ ప్రత్యేక ప్రచారం జూలై 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఉద్యోగుల నమోదు కోసం అక్టోబర్ 31 వరకు అవకాశం ఉంది. వివిధ సంస్థల్లో 2009 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 మధ్య కాలంలో పనిచేసినా, అర్హత ఉన్నప్పటికీ గతంలో ఝాఖీలో నమోదు కాని ఉద్యోగులను ఈ పథకం కింద చేర్చవచ్చు. అయితే డిక్లరేషన్ సమయంలో సంబంధిత ఉద్యోగి అదే సంస్థలో ఉద్యోగంలో కొనసాగుతూ ఉండాలి.

**యజమానులకు ప్రత్యేక వెసులుబాటు**

గతంలో ఉద్యోగుల నుంచి పీఎఫ్ వాటా మినహాయించకపోయిన సందర్భాల్లో, జుజుజ-2026 కింద ప్రకటించిన ఉద్యోగులకు ఉద్యోగి వాటా చెల్లింపు నుంచి మినహాయింపు కల్పించారు. అయితే యజమాని తన వాటాతోపాటు వర్తించే వడ్డీ, అడ్మినిస్ట్రేటివ్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా విధించే నష్టపరిహారానికి బదులుగా ఈ ప్రచారం కింద ఒక్కో సంస్థకు రూ.100 లంప్‌సమ్ డ్యామేజెస్ నిబంధనను తీసుకొచ్చారు.

**ఎవరికి వర్తిస్తుంది?**

ఈ ప్రచారం ప్రధానంగా గతంలో ఈపీఎఫ్ కవరేజీకి దూరమైన అర్హత కలిగిన ఉద్యోగుల కోసం ఉద్దేశించినది. ఈపీఎఫ్ పరిధిలో ఉన్న లేదా ఈపీఎఫ్ చట్టం/సామాజిక భద్రతా కోడ్ కింద కవరేజీకి వచ్చే సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. యజమానులు తమ పాత ఉద్యోగ, వేతన రికార్డులను పరిశీలించి అర్హులైన ఉద్యోగులు ఎవరైనా నమోదు కాకుండా మిగిలిపోయారా అనేది గుర్తించాలని ఈపీఎఫ్‌వో సూచించింది.

**ఆన్‌లైన్‌లోనే నమోదు**

జుజుజ-2026 కింద నమోదు ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. ప్రకటించిన ఉద్యోగులకు ఉమాంగ్ యాప్ ద్వారా ఫేస్ ఆథెంటికేషన్ ఆధారంగా ఖాతీ జనరేషన్, అనంతరం జుజ= ద్వారా సంబంధిత పీఎఫ్ కాంట్రిబ్యూషన్ల చెల్లింపు వంటి విధానాలను ఈపీఎఫ్‌వో పేర్కొంది. దీంతో గతంలో నమోదు కాని ఉద్యోగులను అధికారిక సామాజిక భద్రతా వ్యవస్థలోకి తీసుకురావడంతోపాటు రికార్డుల్లో పారదర్శకత పెరగనుంది.

**ఉద్యోగులకు ప్రయోజనం ఏంటి?**

ఈపీఎఫ్‌లో నమోదు కావడం ద్వారా అర్హత కలిగిన ఉద్యోగులకు భవిష్య నిధి మాత్రమే కాకుండా సంబంధిత పెన్షన్, ఉద్యోగి డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయి. అదే సమయంలో సంస్థల గత కాంప్లయన్స్ లోపాలను క్రమబద్ధీకరించేందుకు కూడా ఈ ప్రత్యేక విండో ఉపయోగపడుతుంది.

# సెప్టెంబర్ నెలలో 14 రోజుల పాటు బ్యాంకులు బంద్..

బ్యాంకింగ్ ఖాతాదారులకు బిగ్ అలర్ట్. ఆగస్ట్ నెల ముగిసి సెప్టెంబర్ నెల రాబోతుంది. దీంతో బ్యాంక్ సెలవులు కూడా మారుతున్నాయి. కొత్త నెలలో బ్యాంకులు ఏయే రోజుల్లో మూతపడతాయనేది తెలుసుకోవడం ముఖ్యం. దీని వల్ల ముందుగానే బ్యాంక్ లావాదేవీలను ప్లాన్ చేసుకోవచ్చు. సెప్టెంబర్‌లో తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బ్యాంక్ సంఘాలు సమ్మెకు దిగుతున్నాయి. ఈ మేరకు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాక్ యూనియన్స్ సమ్మెకు పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 11న దేశవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఐదు రోజుల వర్కింగ్ డేస్ అమలు చేయడంతో పెన్షన్లలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనలు చేపట్టనున్నారు. దీంతో ఆ రోజు కూడా బ్యాంకులు మూతపడే అవకాశముంది. ఇక సెప్టెంబర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి, వినాయక చవితి లాంటి అనేక పండుగలు వచ్చాయి. ఈ కారణంతో బ్యాంకులు ఎక్కువ రోజుల పాటు మూతపడనున్నాయి.

**సెప్టెంబర్‌లో బ్యాంక్ సెలవులు ఇవే..**

-సెప్టెంబర్ 4న శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి. ఏపీ, తెలంగాణలో కూడా బంద్ కానున్నాయిః
-సెప్టెంబర్ 6న ఆదివారం సందర్భంగా సాధారణ సెలవు
సెప్టెంబర్ 11న బ్యాంక్ ఉద్యోగుల సమ్మె కారణంగా బ్యాంక్ సేవల్లో అంతరాయం
-సెప్టెంబర్ 12న రెండో శనివారం కావడంతో బ్యాంకులు ఉండవు
-సెప్టెంబర్ 13న ఆదివారం బ్యాంకులు పనిచేయవు
-సెప్టెంబర్ 14న వినాయక చవితి సందర్భంగా బ్యాంకులకు సెలవు దినం
-సెప్టెంబర్ 15న గణేశ్ చతుర్థి రెండో రోజు సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో బ్యాంకులు ఉండవు
-సెప్టెంబర్ 20న ఆదివారం రోజున బ్యాంకులకు సాధారణ సెలవు
-సెప్టెంబర్ 21న సోమవారం శ్రీమంత శంకర్ దేవ్ జన్మదినం సందర్భంగా భువనేశ్వర్, తిరువనంతపురంలో బ్యాంకులు బంద్ అవుతాయి
-సెప్టెంబర్ 26 నాలుగో శనివారం సందర్భంగా బ్యాంకులు బంద్
-సెప్టెంబర్ 27 ఆదివారం బ్యాంకులు ఉండవు




**బ్యాంక్ సెలవుల్లో మార్పులు**

అయితే బ్యాంక్ సెలవులు అనేది రాష్ట్రం, ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పండుగలు ఉంటాయి. దీంతో ఒక ప్రాంతంలో సెలవు ఉంటే.. మరొక ప్రాంతంలో సెలవు వర్తించదు. దీంతో మీరు బ్యాంక్‌కు వెళ్లాలనుకున్నప్పుడు ఒకసారి బ్రాంచ్ సిబ్బందిని సంప్రదించి కన్ఫార్మేషన్ తీసుకోవడం మంచిది. అయితే బ్యాంకులు మూతపడితే కేవలం బ్యాంక్ సంబంధిత కార్యకలాపాలు మాత్రమే నిలిచిపోతాయి. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా యథావిధిగా కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. కేవలం చెక్కుల క్లియరెన్స్ సేవలు వంటి నిలిచిపోతాయని చెప్పవచ్చు.

# లార్డ్స్‌లో అబ్బాస్ పాంచ్ పటాకా..
# పాకిస్థాన్ బ్యాటర్లు అద్భుతం చేసేనా..!

లార్డ్స్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఆలౌటైంది. పాకిస్థాన్ పేసర్ మొహమ్మద్ అబ్బాస్(5-57) ఐదు వికెట్లతో చెలరేగగా.. ఆతిథ్య జట్టు నాలుగోరోజు తొలి సెషన్‌లోనే కుప్పకూలింది. డాన్ లారెన్స్(54) అర్ధ శతకంతో, హ్యారీ బ్రూక్(34) మాత్రమే రాణించారు. పాకిస్థాన్‌కు 389 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన జో రూట్ సేన.. సిరీస్‌ను వైట్‌వాష్ చేయాలనే పట్టుదలతో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో చేతులెత్తేసిన పాక్ బ్యాటర్లు.. పటిష్టమైన పేస్ దళాన్ని ఎదుర్కొని ఓటమిని తప్పిస్తారా? అనేది ఆసక్తి రేపుతోంది. రసవత్తరంగా సాగుతున్న లార్డ్స్ టెస్టులో ఇంగ్లండ్ ఆలౌటైంది. నాలుగో రోజు జహీర్ అబ్బాస్(5-57) విజృంభణతో లోయర్ ఆర్డర్ తోకముడవగా ఆతిథ్య జట్టు 208 పరుగులకే ఆలౌటైంది. ఓలీ రాబిన్సన్(8)ను పెవిలియన్ పంపిన అబ్బాస్ లార్డ్స్‌లో ఐదువికెట్ల ప్రదర్శన చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగుల ఆధిక్యంతో ఆట కొనసాగించిన ఇంగ్లండ్‌ను పాక్ పేసర్లు అద్భుతంగా కట్టడి చేశారు. అబ్బాస్, ఖుర్రం, మొహమ్మద్ అలీ()లు వరసగా వికెట్లు తీసి పాక్‌ను పోటీలోకి తెచ్చారు. అయితే.. హ్యారీ బ్రూక్(34), డాన్ లారెన్స్(54)లు పట్టుదలగా ఆడారు. పునరాగమనం సిరీస్‌లో ఆకట్టుకున్న లారెన్స్ అర్ధ శతకంతో ఇంగ్లండ్ ఆధిక్యాన్ని పెంచుతూ పోయాడు. క్రీజులో పాతుకుపోయిన అతడిని బౌల్డ్ చేసిన అబ్బాస్ ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. చివరి బ్యాటరైన ఓలీ రాబిన్సన్(8) వికెట్టూ తీసి.. లార్డ్స్‌తో చిరస్మరణీయ ప్రదర్శనతో రికార్డు సాధించాడీ పాక్ పేసర్. 389 పరుగుల ఛేదనలో పాక్ బ్యాటర్లు నిలబడడంపై ఆ జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి




## కౌంటీల్లో భారత పేస్ అస్త్రం..
## స్వదేశానికి తిరిగి వచ్చేది అప్పుడే..!

రంజీ ట్రోఫీలో సంచలన ప్రదర్శనతో భారత జెర్సీ ధరించిన అకీబ్ నబీ విదేశాల్లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. టెస్టుల్లో మరింత బౌలింగ్ అనుభవం కోసం ఇంగ్లండ్‌కు వెళ్లిన అతడు అక్కడ కౌంటీ ఛాంపియన్‌షిప్ లో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. మూడు కౌంటీ మ్యాచుల్లో ఆడనున్న ఈ స్పీడ్‌స్టర్.. సర్రే జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అనంతరం.. సెప్టెంబర్‌లో మూడో వారంలో నబీ స్వదేశానికి తిరిగి రానున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(ఔజ 2025-27)లో కీలకమైన న్యూజిలాండ్ పర్యటనలో యువ పేసర్ అకీబ్ నబీని అస్త్రంగా ప్రయోగించాలనుకుంటోంది భారత జట్టు. అందుకని.. కివీస్ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకొని అతడిని ఇంగ్లండ్‌లో కౌంటీలు ఆడేందుకు పంపింది బీసీసీఐ. టెస్టు బౌలర్‌గా నబీ మరింత రాటుదేలడం కోసం, ఇంగ్లండ్ పరిస్థితుల్లో అతడి స్వింగ్ నైపుణ్యాన్ని పరీక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకుంది బీసీసీఐ.




**సెప్టెంబర్ 2న అరంగేట్రం**

దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్ స్క్వాడ్ నుంచి వైదొలిగిన నబీ.. యూకే వీసాతో ఇంగ్లండ్ చేరుకున్నాడు. అక్కడ సర్రే జట్టు తరఫున మూడు కౌంటీ మ్యాచ్‌లు ఆడనున్నాడీ బారాముల్లా ఎక్స్‌ప్రెస్. సెప్టెంబర్ 2వ తేదీన యార్క్‌షైర్ జట్టును సర్రే ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్‌తో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో నబీ అరంగేట్రం చేయనున్నాడు. అనంతరం సెప్టెంబర్ 8న సస్సెక్స్ జట్టుతో, సెప్టెంబర్ 15న గ్లమోర్గాన్ జట్టుతో సర్రే తలపడనుంది. ఈ మూడు మ్యాచులు పూర్తయ్యాక పుదుచ్చేరిలో సెప్టెంబర్ 22న ఆస్ట్రేలియా ఏతో మ్యాచ్ కోసం నబీ భారత్‌కు రానున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 43 మ్యాచుల్లోనే 162 వికెట్లు తీసిన ఈ పేస్‌గన్.. రాబోయే రోజుల్లో టీమిండియా బౌలింగ్ దళంలో కీలకం కానున్నాడు.

## స్పోర్ట్స్

### 15 ఏళ్లకే కెప్టెన్సీ..
### ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన వైభవ్..!



పదిహేనేళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన వైభవ్ సూర్యవంశీ మరో ఘనత సాధించాడు. అత్యంత పిన్నవయస్కుడిగా పలు రికార్డులు నెలకొల్పిన వైభవ్.. ఈసారి కెప్టెన్సీ చేపట్టాడు. దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీ లో ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైన ఈ కుర్రాడు.. సెమీఫైనల్లో సారథిగా వ్యవహరించాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడడంతో.. డిప్యూటీ అయిన వైభవ్ ఈస్ట్ జోన్ పగ్గాలు అందుకున్నాడు. తద్వారా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతి చిన్నవయస్కుడైన సారథిగా చరిత్ర సృష్టించాడీ డాషింగ్ ఓపెనర్. విధ్వంసక ఆటకు కేరాఫైన వైభవ్ పదిహేనేళ్లకే కెప్టెన్‌గా జట్టును నడిపించాడు. 2024లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన వైభవ్.. రెండేళ్లకే సారథిగా అవకాశం దక్కించుకున్నాడు. దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా ఉన్న అతడు.. ఆదివారం సౌత్ జోన్‌తో సెమీఫైనల్ మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ చేతికి గాయమవ్వడంతో అతడు మైదానం వీడగా.. వైభవ్ బాధ్యతలు తీసుకున్నాడు. తనకంటే రెండింతలు వయసులో పెద్దవారైనా మహమ్మద్ షమీ, అభిమన్యు ఈశ్వరన్, ముకేశ్ కుమార్‌లకు 15 ఏళ్ల వైభవ్ నాయకత్వం వహించడం విశేషం.

**రివ్యూ హిట్టే..**

మొదటిసారి దులీప్ ట్రోఫీ ఆడుతున్న వైభవ్ నాయకుడిగా తొలి మ్యాచ్‌లోనే బౌలింగ్, ఫీల్డింగ్ మార్పులతో ఆకట్టుకున్నాడు. ముకేష్ కుమార్ ఓవర్లో ఆర్యన్ జుయల్ ఆడిన బంతి..ఎడ్జ్ తీసుకోగా వికెట్ ఒడుపుగా అందుకున్నాడు. అయితే.. అంపైర్ నాటౌట్ ఇవ్వగా.. తటపటాయిస్తూనే రివ్యూ తీసుకొని విజయవంతమయ్యాడు వైభవ్. దాంతో, తొలి రోజే సెంట్రల్ జోన్ జట్టు 266 పరుగులకే ఆలౌటైంది. రింకూ సింగ్(60), ఆర్యన్ జుయల్(46)లు మాత్రమే పర్వాలేదనిపించారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో అభిజిత్(3-38), ముకేశ్ కుమార్(3-56)లు మూడేసి వికెట్లు తీయగా.. షమీ, ఖురేషిలు రెండేసి వికెట్లతో రాణించారు. ఐపీఎల్‌లో రికార్డు శతకాలతో జాతీయ జట్టులోకి వచ్చిన వైభవ్ జింబాబ్వే పర్యటనలో మెరిశాడు. ఇప్పుడు దేశవాళీలోనూ అదరగొడుతున్నాడీ కుర్ర సంచలనం. ప్రతిసారి తుఫాన్ ఇన్నింగ్స్‌లతో వార్తల్లో నిలిచే వైభవ్ ఈసారి బంతితో మ్యాజిక్ చేశాడు. ఎడమ చేతివాటం స్పిన్నరైన అతడు.. నార్త్ ఈస్ట్ జోన్‌పై నాలుగు బంతుల్లోనే రెండు వికెట్లతో ఔరా అనిపించాడు. బ్యాటుతో 8 పరుగులే చేసినా ఆ రెండు వికెట్లతో ఈస్ట్ జోన్ సెమీస్ చేరడంలో తనవంతు పాత్ర పోషించిన అతడు.. తాను బౌలింగ్ చేస్తాననే విషయం కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు తెలియదని చెప్పాడు. నార్త్ ఈస్ట్ జోన్ జట్టుపై నాలుగు బంతుల్లోనే 2 వికెట్లు తీసి ఆశ్చర్యపరిచాడు. తమ జట్టు సెమీస్ చేరడంలో కీలకమైన అతడు 'నేనూ వికెట్లు తీయగలను అని మా కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు తెలియదు' అని పేర్కొన్నాడీ యువ సంచలనం. ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ 210 పరుగులతో గెలుపొంది సెమీస్‌కు దూసుకెళ్లింది.



# యష్ 'టాక్సిక్' సునామీ.. ట్రోలింగ్ ఎఫెక్ట్ ఉన్నా.. 4 రోజుల్లో రూ. 254 కోట్లు!

రాకింగ్ స్టార్ యష్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టెల్ ఫర్ గ్రోన్-అప్స్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. సినిమాలోని హింసాత్మక సన్నివేశాలు, రొమాంటిక్ ట్రాక్స్ మరియు మహిళలను చూపించిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు, ట్రోలింగ్ వస్తున్నప్పటికీ కలెక్షన్లపై మాత్రం ఎలాంటి ప్రభావం పడలేదు. విడుదలైన కేవలం 4 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 254.75 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టి సంచలనం సృష్టిస్తోంది. తాజా నివేదిక ప్రకారం ఈ సినిమా నాల్గవ రోజు దేశవ్యాప్తంగా సుమారు రూ. 24.50 కోట్ల నెట్ కలెక్షన్లను సాధించింది. దీంతో భారత్‌లో నాలుగు రోజుల మొత్తం నెట్ కలెక్షన్లు రూ. 190.45 కోట్లకు చేరగా, ఇండియా గ్రాస్ కలెక్షన్లు రూ. 227.50 కోట్లకు చేరుకున్నాయి. శుక్రవారంతో పోలిస్తే శనివారం దేశీయ వసూళ్లలో సుమారు 9.9 శాతం స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, వీకెండ్ కావడంతో వసూళ్లు పటిష్టంగానే సాగాయి. ఇక ఓవర్సీస్‌లో శనివారం రూ. 4 కోట్లు రాబట్టడంతో, విదేశీ గడ్డపై మొత్తం కలెక్షన్లు రూ. 27.25 కోట్లకు తాకాయి. కాగా, ఆగస్టు 26న కన్నడ, హిందీ, తమిళం, తెలుగు, మలయాళం మరియు ఇంగ్లీష్ భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రంలో హుమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా, నయనతార మరియు కియారా అద్వానీ కీలక పాత్రల్లో నటించారు.

# బాలయ్య -- కొరటాల సినిమాలో కోలీవుడ్ స్టార్ హీరో.!

టాలీవుడ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం చర్చ జరుగుతున్న కాంబినేషన్ నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ కొరటాల శివ కలయిక. 'దేవర' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న కొరటాల శివ, తన తదుపరి ప్రాజెక్ట్‌ను నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో వినిపిస్తున్న కొన్ని వార్తలు అటు నందమూరి అభిమానుల్లో, ఇటు సినీ వర్గాలలో విపరీతమైన అంచనాలను పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో బాలకృష్ణను ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ అవతార్‌లో దర్శకుడు చూపించబోతున్నట్లు తెలుస్తోంది. కేవలం యాక్షన్ కే పరిమితం కాకుండా, కథలో బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కొరటాల శివ పెద్దపీట వేస్తున్నారట. ఇప్పటివరకు ఆయన తెరకెక్కించిన సినిమాలన్నింటికీ ఒక బలమైన సామాజిక నేపథ్యం లేదా ప్రత్యేకమైన బ్యాక్‌డ్రాప్ ఉండటం విశేషం. ఇప్పుడు ఈ సినిమా కోసం కూడా అదే స్థాయిలో ఒక యూనిక్ బ్యాక్‌డ్రాప్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నెటిజన్లు మరియు సినీ విశ్లేషకులు ఈ సినిమా కథ ఏ నేపథ్యంతో సాగుతుందనే దానిపై సోషల్ మీడియాలో రకరకాల చర్చలు జరుపుతున్నారు. అంతేకాకుండా, ఈ సినిమాలో ఒక ప్రత్యేకమైన కీలక పాత్ర కోసం కోలీవుడ్ స్టార్ హీరో ఆర్యను సంప్రదించే పనిలో కొరటాల శివ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఆర్య ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడని, ఆయన పాత్ర సినిమాకే ఒక మేజర్ హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. కథా చర్చలు పూర్తి కావడంతో త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. హ్యాట్రిక్ విజయాల జోరుమీదున్న బాలయ్య బాబుతో, మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కొరటాల శివ చేతులు కలపడంతో బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.






# ఓటీటీలోకి 'కొరియన్ కనకరాజు'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'. థియేటర్లలో ప్రేక్షకులను కడుపుబ్బా నవించిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో సెప్టెంబర్ 4, 2026 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తుంది. తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రాబోతుంది. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, సత్య కామెడీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాను ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యువి క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. థియేటర్లలో అలరించిన ఈ మూవీ ఓటీటీలో ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన కనకరాజు (వరుణ్ తేజ్) చెక్కభజన ప్రదర్శనలు చేస్తూ సరదాగా గడిపేస్తుంటాడు. కియా ఫ్యాక్టరీలో పనిచేసే చైత్ర (రితికా నాయక్)ను ప్రేమిస్తాడు. ఇదే సమయంలో కొరియా నుంచి వచ్చిన ఓ గ్యాంగ్‌స్టర్ ఆత్మ కనకరాజు శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ ఆత్మ ఎవరిది? దాని లక్ష్యం ఏమిటి? దాని నుంచి బయటపడేందుకు కనకరాజు ఎందుకు కొరియా వెళ్లాల్సి వచ్చింది? అనేదే మిగతా కథ.

# మైత్రీ మూవీ మేకర్స్ తొలి హారర్ మూవీ '418'..

## రిలీజ్ ఎప్పుడో తెలియక ఫ్యాన్స్‌లో పెరుగుతున్న ఆసక్తి!




మైత్రీ మూవీ మేకర్స్ ప్రస్తుతం వరుస విజయాలతో టాలీవుడ్‌లో జోరు మీద ఉంది. తాజాగా 'ఇరుముడి'తో భారీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను అందుకున్న ఈ నిర్మాణ సంస్థ.. మరోవైపు విభిన్న కథాం శాలతో తెరకెక్కుతున్న పలు క్రేజీ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. అయితే ఈ బ్యానర్ నుంచి రాబోతున్న తొలి హారర్ థ్రిల్లర్ '418' మాత్రం ఇంకా రిలీజ్ డేట్ కోసం ఎదురుచూస్తోంది. ఇప్పటికే సినిమా విడుదలకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. కొత్త విడుదల తేదీపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. '418' చిత్రానికి కీర్తన్ నాగగౌడ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంత్ నీల్ ఈ ప్రాజెక్ట్‌కు బ్యాకింగ్ అందిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ప్రీతి పగడాల కథానాయికగా నటిస్తున్నారు. నిజానికి ఈ చిత్రాన్ని 2026 జూలై 31న థియేటర్లలో విడుదల చేయాలని మేకర్స్ మొదట నిర్ణయించారు. అయితే విడుదలకు కొద్ది రోజుల ముందు అనూహ్యంగా సినిమాను వాయిదా వేశారు. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చిత్ర బృందం అప్పట్లో వెల్లడించింది.అయితే జూలై చివరిలో రిలీజ్ వాయిదా పడినప్పటి నుంచి దాదాపు నెల రోజులు గడిచినా.. ఇప్పటివరకు కొత్త రిలీజ్ డేట్‌ను మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. దీంతో అసలు '418' సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే ప్రశ్న ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మైత్రీ మూవీ మేకర్స్ పేరు టాలీవుడ్‌లో భారీ కమర్షియల్ సినిమాలతో పాటు విభిన్న కథలను తెరకెక్కించే నిర్మాణ సంస్థగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో ఆ బ్యానర్ నుంచి వస్తున్న తొలి హారర్ థ్రిల్లర్ కావడంతో '418'పై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించిన కథ, పాత్రలు, కీలకమైన అంశాలను మేకర్స్ పెద్దగా బయటకు వెల్లడించలేదు. దీంతో సినిమా కాన్సెప్ట్ ఏంటి? ఇందులో ఎలాంటి హారర్ ఎలిమెంట్స్ ఉండబోతున్నాయి? అనే విషయాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతోంది. ప్రశాంత్ నీల్ పేరు ఈ ప్రాజెక్ట్‌తో అనుసంధానం కావడం కూడా సినిమాపై అంచనాలు పెరగడానికి మరో కారణంగా మారింది. కీర్తన్ నాగగౌడ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించబోతోందనేది తెలియాలంటే మరికొంత సమయం వేచి చూడాల్సిందే.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com